
# భిన్న ధ్రువాలు




పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

ఏ మాట కా మాటే అనుకోవాలి. ట్రాన్స్ఫర్ అయి ఈ ఊరికి ఈ కొత్త ఆఫీసరు రాకపోయినా, వచ్చి గోపాలాన్నీ విశ్వనాథాన్నీ ఒక కంట కనిపెట్టక పోయినా, కనిపెట్టి ఇద్దర్నీ కలిసి ఉమ్మడిగా చివాట్లు పెడుతూ ఉండకపోయినా, వాళ్ళ ప్రాణానికో చిన్న సైజు యముఁడిలా తయారు కాకపోయినా, వీటిలో ఏ ఒక్కటి జరక్కపోయినా, గోపాలం విశ్వనాథం ఇంత ప్రాణ స్నేహితులు అయి ఉండకపోదురు. వాళ్ళ ఇద్దర్నీ ఇంత సన్నిహితులుగా చేసిన పుణ్యం, గౌరవం, గొప్ప ఇలాంటివి ఏవైనా ఉన్నాయంటే అవన్నీ పూర్తిగా ఆఫీసరు గారివే.

లేకపోతే వీళ్ళిద్దరూ ఇంత క్రితం మొహం మొహం చూసుకుని ఎరుగుదురూ?. . . ఒకే ఆఫీసులో పని చేస్తున్నా రెండు భిన్న ధ్రువాలు వాళ్ళిద్దరూ. గోపాలం లోకం గోపాలానిది. విశ్వనాథం ప్రపంచం విశ్వనాథానిదీను. ఒకడు పరమ సాత్త్వికుడూ, ఇంకోడు పైలాపచ్చీసూ. ఒకడు మహా భయస్థుడూ, పైగా గృహస్థుడూను. మరోడు నిర్లక్ష్యాన్నే లక్ష్యంగా పెట్టుకున్న ఘోటక బ్రహ్మచారి. గోపాలం ఒకరి జోలికీ శొంఠికీ పోడు. విశ్వనాథానికి ఊళ్ళో నాడవలన్నీ తనకే కావాలి. అధికారులు ఏమనుకుని పోతారో అని గోపాలం నూటనాలుగు డిగ్రీల జ్వరం కూడా ఆఫీసుకు వెడితే, అవసరం లేకపోయినా అఖిల కాజువల్ లీవుకూడా వాడుకుంటే కాని విశ్వనాథానికి నిద్దర పట్టదు. జీతాన్ని జాగ్రత్తగా నెలంతా వాడుకుంటూ, బుద్ధిమంతుడిలా పంచెకట్టూ, అంటకత్తెర జుట్టూ వీటితో గోపాలం కాలక్షేపం చేస్తే, వచ్చిన జీతాన్ని ఒకటో తారీఖునే టెరిలిన్ షర్టులలోకీ, కాన్వార్ చెప్పల్స్‌లోకి మార్చేసి, మర్నాటినుంచీ క్రాపింగ్ ఎగరేసుకుంటూ కనిపించిన ప్రతి వాడి దగ్గరా చేబదుళ్ళ కోసం చెయ్యి జాపుతాడు విశ్వనాధం.

ఇలాంటి ఒక అంట కత్తెర జుట్టునీ—బిరుసు క్రాపింగునీ దగ్గరగా తీసుకు రావడం ఎంతో కష్టం. అలాంటిది కష్టపడి తీసుకు వచ్చాడంటే ఆ ఘనత అంతా ఆఫీసరుదే. గోపాలం మందకొడితనాన్నీ విశ్వనాథం తొందరపాటునీ ఒక లాగే సత్కరించ సాగారు ఆఫీసరుగారు. రోజూ ఎందుకో ఒకందుకు ఇద్దరికీ ఆఫీసరుగారి దీవెనలు తప్పకుండా లభించడంతో, ఆఫీసు వదిలాక వాళ్ళిద్దరికీ ఎంతో సామగ్రి ఉండేది ముచ్చటించుకోవడానికి. ఒక్కొక్క పూట ఆఫీసరు మీద ఆప్యాయత విజృంభించేసి వాళ్ళు వల్లించే అష్టోత్తరం అర్ధరాత్రికికూడా పూర్తి అయేది కాదు. అందువల్ల మర్నాడు పొద్దుటే మిగిలిన నామావళి అందుకోవలసి వచ్చేది. కొన్నాళ్ళు చూసి ఇదేం బాగో లేదని తన సావాసుని గోపాలం ఎలాగో అలాగి తక్కిన రెండు గదుల్లోకీ సర్దుకుని మిగిలిన తన వీధిగదిలో విశ్వనాథానికి విడిది ఏర్పాటు చేశాడు. దాంతో వాళ్ళకి పుష్కలంగా టైమ్ దొరికింది, ఆఫీసరు మీద

## ఈ మౌనం

**డా॥ సి. నారాయణ రెడ్డి**

ఒంటరితనం గదికుంది
ఊహలకు లేదు.
నాలుగు గోడలమధ్య
మూలుగుతున్న ఇరుకులో
సముద్రాల విస్తృతి ఉంది
తిమింగలాల ఉద్ధృతి ఉంది.

పిలిచే సర్పాలున్నాయి
కరిచే పుష్పాలున్నాయి.
కళ్ళను తప్పించుకుని గుండెనుంచి
వెల్లుబికే బాష్పాలున్నాయి.

గాలి నోటిలో ఇరుక్కున్న
పూల ఊపిరులు
వల్లకాటిలో మేల్కొన్న
జ్వాలా మంజరులు
ఉన్నాయి ఈ గదిలో
ఒంటరితనం అంపపొదిలో.

ఎగిరే పక్షులు ఈ మొగ్గలు
ఎదిగే చిచ్చులు ఈ ఓర్పులు.
తొందరపడకు; ఈ మౌనం
తుఫానులకు జన్మస్థానం

అవసరం అయితే సహస్రనామాలుకూడా వల్లించడానికి.

ఆఫీసరుకి బహూకరించిన ప్రతి కొత్త బిరుదుకీ విశ్వనాథానికి గోపాలందగ్గర్నుంచి ఒక మంచి కాఫీయో, హోటల్ భోజనంలోకి ఇంత ఊరగాయో లభించేది. ఒక్కో రోజున ఆఫీసరు మీదికి మరీ దురుసుగా కనక బండి పోనిస్తే, ఆ రోజున గోపాలం ఇంట్లో ఆతిథ్యమే దొరికేది విశ్వనాథానికి. ఈ విధంగా ఆ భిన్నధ్రువాలు రెండూ ఆఫీసులో ఉండే ఆయిదారు గంటలూ తప్పించి తక్కిన రోజంతా ఏకధ్రువమయిపోయి ఇచక్కా ఆఫీసరు మీద జోక్స్ విసురుకుంటూ నవ్వుకుంటూ ఆదర్శమైన మైత్రికి నిపురూపమైన ఉదాహరణగా ఉండిపోయాయి.

ఇలా ఉండగా ఒక రోజున గోపాలం భోజనం చేసి బట్టలు వేసుకుని విశ్వనాథం కోసం చూసేసరికి అతని దగ్గర ఆఫీసుకి బయలుదేరే లక్షణా లేం కనిపించలేదు. గంట క్రితం తను స్నానానికని బయలుదేరినప్పు డెలా ఉన్నాడో ఇప్పుడూ అలాగే ఉన్నాడు. గడ్డం గీసుకోకుండా, గూడకట్టు పంచెతో మడతమంచం మీద వెల్లకిలా పడుకుని, గాలిలోకి రింగులుగా సిగరెట్ పొగ వదులుతూ ఆలోచిస్తున్నాడు. టైమ్ చూస్తే తొమ్మిదిన్నర దాటుతూంది. ఆలోచనలో పడి అబ్బాయిగారు ఆఫీసు సంగతి మరిచిపోయినట్లున్నారు.

"ఏయ్. విస్సన్నా! లే. ఇంకా అలా పడుకున్నావేమిటి? ఆఫీసుకి టైమ్ అవుతోంది. మళ్ళీ ఆలస్యం అయితే అవతల నరకాసురుడు ఏడుస్తాడు."

వాళ్ళ భాషలో ఆఫీసరుకి గల అనేక పేర్లలో నరకాసురుడు ఒకటి మొద్దు పేరయినా, ఏడుడానికి మాత్రం అర్థం తిట్టడమే. గోపాలం హెచ్చరిక విన్నాకూడా విశ్వనాథ్‌లో చలనం కలగలేదు. కాస్సేపు విశ్వనాథ్ వైపు విస్తుపోయి చూసి, గోపాలం మళ్ళీ హెచ్చరిక చేశాడు. ఈ సారు విశ్వనాథం కొద్దిగా కదిలి, కళ్ళతో గోపాలాన్ని గదిలోకి రమ్మని సంజ్ఞ చేసి, పక్కనే స్టూల్ మీద ఉన్న లీవ్ లెటర్‌ని అతనికి అందించాడు.

"ఈ గంటలోనే ఏం వచ్చింది నీకు?" అంటూనే ఆ శలవు చీటీ అందుకుని నాలుగు పంక్తులు చదివి, "ఒరి నీ అసాధ్యం కూలా? వంట చేసుకుంటూంటే గంజి పడి నీ కుడిచెయ్యి కాలి బొబ్బ లెక్కి పోయిందీ? . . . ఈ అబద్ధం ఏమిటి? కుడి చెయ్యి నిక్షేపంలా ఉంటే, ఏమిటిది?" అన్నాడు గోపాలం.

"అది అంతేలే" అన్నాడు నిర్లక్ష్యంగా. విశ్వనాథ్.

"ఇప్పుడు మార్చి ఆఖరు వారం కదా? ఈ లెటరస్సి హడావిడిలో నీకు లీవు గ్రాంట్ చేస్తాడూ?"

అందుకే కదుటోయ్ చెయ్యి కాలిందని పెట్టాను అందులోనూ కుడి చెయ్యి—ఎన్ని ఆలోచించి ఇలా పెట్టేనటావ్?"

పెట్టావయ్యా . . . బాగానే ఉంది. కాని ఆ హిరణ్యాక్షుడు గ్రాంట్ చెయ్యొద్దూ?"

నిక్షేపంలా చేస్తాడు. అది అంతా నువ్వు చెప్పడం మీద ఆధారపడి ఉంటుంది. నువ్వు కాస్త జాగ్రత్తగా వర్ణించి చాలా ప్రమాదం జరిగి ఉన్నట్లూ, ఇంకొంచెం ఉంటే ఒళ్ళంతా కాలిపోయి ఉన్నట్లూ తెలివిగా చెప్పావంటే మహ చక్కగా గ్రాంట్ చేస్తాడు."

ఏమిటో నా కీ అబద్ధాలు చెప్పటం అస్సలు అలవాటు లేదు."

"అలా అని తడబడేవు సుమా—కొంప దీసేస్తావు. వాడసలే అసాధ్యుడు. అనుమానిస్తే పేగులు లెక్క పెడతాడు."

"అసలు ఎందుకొచ్చిన తంటాలు ఇవన్నీ శుభ్రంగా ఆఫీసుకి వచ్చెయ్యకూడదూ?"

"వీల్లేకే కాదుటోయ్ ఇదంతా."

"ఏమిటి వీల్లేనిది? నీ కిప్పుడు వచ్చిన మహా ప్రమాదం ఏమిటో?"

"ప్రమాదం అంటే ప్రమాదమే. అయినా నీ దగ్గర చెప్పక పోవడానికీ దాపరికానికీ ఏముంది కాని విను. నేను తరుచు చెబుతూ ఉంటాను లలిత అని వాళ్ళ నాన్న ఇవాళ ఒక సంబంధం ఏదో రైటు చేసెయ్యాలనుకుంటున్నాడట. అందువల్ల నన్ను మంచున్న పళంగా బయల్దేరి వచ్చి వాళ్ళ నాన్నతో మాట్లాడమనీ, లేకపోతే ఆనక ఇద్దరం విచారించవలసి వస్తుందనీ, వాళ్ళ ఊరునుంచి ఒక కుర్రాడి ద్వారా చీటీ రాసి పంపింది.

"ఇప్పుడా ఊరు వెళ్ళి ఆ సంబంధం తప్పించి నీ సంబంధాన్ని ఖాయ పరుచుకుని రావాలన్నమాట. . . సరే కానియ్యి. తప్పుతుందా?" అంటూ లేచాడు గోపాలం.

"నువ్వు జాగ్రత్తగా చెప్పాలి సుమా. ఇవాల్టికి నువ్వేలాగ గట్టెక్కించావంటే, రేపటి సంగతి నేను చూసుకుంటాను" అన్నాడు విశ్వనాథ్.

"ఏం చూసుకుంటావో ఏమో" అని నసుగుతూ అయిష్టంగా అడుగు కదిపాడు గోపాలం.

* * *

ఆ రోజు శనివారం. మర్నాడు పది గంటల దాకా కూడా విశ్వనాథ్ రూమ్‌కి తిరిగి రాకపోయేసరికి, కలు కాలిన పిల్లి లాగ వీధిలోకి, ఇంట్లోకి తిరుగుతూ తెగ ఇబ్బంది పడుతున్నాడు గోపాలం. బయటికి వచ్చి చూసినప్పుడల్లా విశ్వనాథ్ రూమ్‌కి వేసి ఉన్న తాళంకప్ప అతని కేసి చూసి నవ్వినట్లనిపించి విసుక్కోసాగాడు. ఇంకా రాడేమిటి? . . . ఏమైపోయాడు? . . . పెళ్ళి రాజకీయాలు మాట్లాడుకోడానికి ఇరవైనాలుగు గంటలు సరిపోలేదు కబోలు అబ్బాయి గారికి. ఏమిటో ఈ అర్థం లేని ఉండిపోడం ఆ ఊరు వెళ్ళి ఆ మెట్టున ఘటాల కొంపలు మునిగి పోతాయంటే. కొంప దీసి బస్‌స్టాండ్ నుంచి అలా డైరెక్టుగా ఆఫీసుకి వచ్చెయ్యడు కదా?

ఈ ఆలోచనతో భయం వేసి గోపాలం నిలువెల్లా ఒక్కసారి వణికి పోయాడు. దాంతో ఆనాడు జరిగిందంతా అతని ఆలోచనలో సినిమా రీలులా తిరిగింది . . .


కొత్త సంవత్సరంలో
సరికొత్త నవలాకుసుమాలు
మాదిరెడ్డి సులోచన? — హారికిషన్ నవలలు

| | రూ. పై. |
|---|---|
| స్త్రీ ప్లస్ స్త్రీ | 6.00 |
| ఈ కాపురాలు ఇంతే | 6.00 |
| తల్లి కాని తల్లి | 7.00 |

శ్రీమతి పెన్నేరు పాప

| | |
|---|---|
| దరిచేరని పక్షులు | 7.00 |

డిక్షనరీలు

| | |
|---|---|
| ఇంగ్లీషు-తెలుగు (పాండి) | 2.25 |
| ఇంగ్లీషు-ఇంగ్లీషు-తెలుగు (పాండి) | 3.00 |
| ఈజీ గ్రామర్ (ఇంగ్లీషు-తెలుగు) | 2.00 |

ఈ పై పుస్తకములు మొత్తం కొన్నవారికి పోస్టేజి ఉచితం. డబ్బు ముందుగా మనియార్డరు చేయవలెను వి.పి.లు లేవు!



ఎడ్యుకేషనల్ పబ్లిషర్స్
—కాంగ్రెస్ ఆఫీస్ రోడ్. విజయవాడ-2

రిస్తే, నే నిలా పండుగా, చెయ్యిలా ఆఫీసుకి ఏడవక పెడుదు.''

''ఏదీ—నువ్వేమో రావ్‌కి రాకుండా తిన్నగా ఆఫీసుకే వచ్చేశావాయె. ఇంక నీకు ముందుగా చెప్పడానికి అవకాశం ఏదీ?''

''రాక ఏం చెయ్యను? ట్రైను వెళ్ళిపోయింది. అయినా నువ్విలాగ వెంట బెడతారని నే నేం కల గన్నానా?''

''నేను మాత్రం నువ్విలా ఆఫీసరుగారి దగ్గిరికి వచ్చి ఉడిపి తావని ఊహించానా?''

''ఏమైతేనేం, నీ స్నేహం చేసినందుకు వచ్చినవాళ్ళ పెద్ద పూలని చేసే పదిలావు ఆఫీసరు ఎందుకు,''

''నువ్వు మాత్రం?''

''చాలు చాల్లే... నీ లాంటి వెసరపప్పుగాడితో స్నేహం చెయ్యడం నాదే పొరబాటు.''

''ఆ మాట కొస్తే నీ లాంటి అబద్ధాల కోరుతో స్నేహంచెయ్యడం నాది అంతకంటే పెద్దపొరబాటు.''

''అలాగా?... అయితే ఇవాళ నుంచి నాతో మాట్లాడకు. నాకు ఒళ్ళు మండుకు పోతూంది.''

''నాకూ మండి పోతూంది ఒళ్ళు నిన్ను చూస్తూంటే?''

''షటప్!''

''యూ షటప్!''

జుట్టూ జుట్టూ పట్టుకోబోయిన వాళ్ళిద్దర్నీ తోటి గుమాస్తాలు జోక్యం చేసుకుని విడదీశారు. ఆరోజు అంతా ఒకరికేసి ఒకరు కొరకొరగా చూస్తూనే ఉన్నారు. ఇంటి దగ్గరకూడా ఎవరి మీదా పిల్లి మీదా పెట్టి మాటలు అనుకుంటూనే ఉన్నారు.

## రేపటి పాట

వచ్చే ఉగాది నాటికైనా
నా జాతి ఆశల గాదెలు నిండే
శుభ సమయం రావాలని,
ఆ ఉగాది ఊహలు తెలుగువాడి
హృదయ వీణా తరంగాల
పల్లవులై మోడు వారిన మనసు
చిగురించాలని,
అప్పటికైనా నా వాడలు వెలుగువాడలై
వెలలేని మాగాణులై
తెలుగన్నల కన్నుల్లో వరికంకుల
నవ్వులు నడయాడాలని,
రాజకీయాల ఎండలూ, వడగాడ్పులూ
తగ్గి తెలుగు వాకిళ్ళలో పచ్చని వరి
చేల పైరుగాలి దోబూచులాడుతూ
మనసులు చల్లబడాలని,
ఆ చల్లని వాడల్లో తెలుగువాడు
సగర్వంగా తల ఎత్తుకు తిరగాలని,
నగ మెత్తుకు ఎదగాలని...

-ఎల్లోరా

రెండు రోజులు పోయాక విశ్వనాథ్ తన సీటుని మార్చుకుని గోపాలం వైపు వీపు పెట్టుకుని కూర్చున్నాడు.

మరో నాలుగు రోజులు పోయాక విశ్వనాథ్ చేత గోపాలం గది ఖాళీ చేయించాడు.

ఇలా వాళ్ళిద్దరి మధ్యా మళ్ళీ పచ్చగడ్డి వేస్తే భగ్గు మనడం మొదలెట్టాక, ట్రాన్స్‌ఫర్ అయి ఆఫీసరుగారు మరో ఊరు వెళ్ళిపోయారు.

దానితో ఆఫీసు ఆఫీసు అంతా మహాక ఉమ్మడిగా సమావేశం అయి, ఆశ్చర్యంగా ముక్కు మీద వేలేసుకుంటూ ఈ విధంగా తీర్మానం చేశారు:

''నిజానికి మన గోపాలం, విశ్వనాథ్ ఇద్దరూ మొదటినుంచీ భిన్న ధ్రువాలే. మధ్యలో 'మాగ్నటిక్ మెరిడియన్' లాగ మన ఆఫీసరుగారు ఈ ఊరు వచ్చి ఆ భిన్న ధ్రువాలు రెండింటినీ ఏకం చేశారు. మనస్తూ ఏకం చేసిన పెద్దమనిషి మరి వెళ్ళిపోతూ విడదీసెయ్యడమ్మా... అందుకే పాపం ఆ కాస్త పనీకూడా ఆయనే చేసేసి వెళ్ళిపోయారు. నిజానికి వీళ్ళ మైత్రికి ఆఫీసరుగారే కారణం. మళ్ళీ వీళ్ళ విరోధానికికూడా ఆయనే కారణం. ఏమైతే నేం? వీళ్ళిద్దరూ ఇలా విడిపోయి ఉండడమే మనకి మంచిది. రోజూ మనకి కావలసినంత కాలక్షేపం.''

ఎవరేం తీర్మానాలు చేసుకుంటే ఏం?
గోపాలం గోపాలమే.
విశ్వనాథం విశ్వనాథమే!
ఆఁ... అంతే.

*

ఉన్నవ విజయలక్ష్మి రచనలు
ఆఫీసరుగారమ్మాయి .. 9.00
తప్పునాదికాదు .. 7.00
పిలుపుకోసం .. 8.00
సాధన .. 8.00; నిరీక్షణ .. 7.50
అర్ధాంగి .... 5.00
ఏది కర్తవ్యం? .... 8.50
సుమిత్ర .. 8.50
అంతస్తులు-అభిమానాలు . 6.00
సురేఖా పరిణయం . 5.50
గంటి వెంకట రమణ రచనలు
దిగేము .... 5.00
మరుద్వతి కన్య
ప్రణయగాథ .. 6.00
దేవుడు మూగ బోయాడు . 6.50
ఆశలు వేసిన
కాటు .. యం.జి. సరస్వతి . 8.00

మీ ఉత్తమ అభిరుచికే ప్రతీకలు
దేవేంద్ర పబ్లిషర్స్
ఏలూరు రోడ్
విజయవాడ
520 002

డా॥ కొర్రపాటి గంగాధరరావు రచనలు
స్వర్గసీమ .. 7.00. బోధిశ్రీ .. 7.00
లంబాడోళ్ళ రాందాసు ... 6.00
నవత-మానవత .. కొండమూడి వర్షిణీదేవి 10.00
డాక్టర్ సుజాత | వేములు .. 8.00
హంసగీతి | మీనాక్షీదేవి 10.00
వెలుగు నీడలు .. జి. హేమంత్ 9.00
వాసవి .. " " 6.50
జీవన ప్రవంతి .. శ్యామల . 6.50
నిశ్శబ్ద తరంగాలు ... అట్లూరి చౌదరాణి .. 7.00
పవని నిర్మల ప్రభావతి రచనలు
పాములూ-నిచ్చెనలూ .. 6.50
జీవిత కెరటాలు .. 6.50